సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం, 19, ఏప్రిల్, 2025



సచివాలయ వ్యవస్థపై కుట్ర
సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. క్లస్టరైజేషన్‌లో భాగంగా సచివాలయాలను కుదించనుంది.
10లో ▸



ప్రభుత్వాసుపత్రికి సుస్తీ
పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో జిల్లా కేంద్రమైన భీమవరం ప్రభుత్వాస్పత్రి సమస్యలతో సతమతమవుతోంది.
10లో ▸



అలరిస్తున్న నాటిక పోటీలు
భీమవరం కళారంజని నాటక అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి నాటిక పోటీలు అలరిస్తున్నాయి.
10లో ▸

రైతులను వంచించి.. ప్రాధాన్యం తగ్గించి..

కొనుగోల్ మాయ
- రబీ ధాన్యం సేకరణలో ఆంక్షలు
- దిగుబడుల కంటే తక్కువగా కొనుగోలు లక్ష్యాలు
- ఉమ్మడి జిల్లాలో 62 శాతం మాత్రమే సేకరణ
- పీఆర్ 126 రకం కొనుగోలుకు షరతులు
- ప్రభుత్వ ఆర్భాటానికి భిన్నంగా క్షేత్రస్థాయిలో పరిస్థితి



సాక్షి ప్రతినిధి, ఏలూరు: జిల్లాలో పండించే చివరి గింజ వరకూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది.. ధాన్యం రైతులు ఎక్కడా ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేశాం.. రైతుల సౌకర్యం కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం.. ప్రతి చోటా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం.. రైతు ఎంత పండిస్తే అంతా సేకరించి 24 గంటల్లోనే ఖాతాల్లోకి నగదు జమచేస్తాం.. ఇవి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మొదలు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి వరకూ ప్రతి సమావేశంలో చెప్పిన మాటలు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వచ్చిన దిగుబడుల్లో 62 శాతం మాత్రమే ధాన్యం కొనుగోలును లక్ష్యంగా నిర్దేశించారు. అందులోనూ పీఆర్ 126, ఎస్–10 రకాలపై సరికొత్త ఆంక్షలు తీసుకువచ్చారు. తేమ శాతం పేరుతో యథావిధిగా దోపిడీ, చిరిగిన గోనె సంచులు అవి కూడా నామమాత్రంగా అందుబాటులో ఉన్న పరిస్థితి.

ఇవేం టార్గెట్‌లు

ఏలూరు జిల్లాలో 3.53 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి అంచనా కాగా ముందుగా లక్షన్నర టన్నుల సేకరణ లక్ష్యమని ప్రభుత్వం ప్రకటించింది. స్థానికంగా వినతులు రావడంతో ఈ లక్ష్యాన్ని 2 లక్షల టన్నులకు పెంచింది. దీంతో అనివార్యంగా రైతులు మిగిలిన 1.53 లక్షల టన్నులను దళారులకు విక్రయించాల్సిందే. జిల్లాలో ఇప్పటివరకు 45,128 టన్నుల కొనుగోళ్లు పూర్తయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లాలో 9.25 లక్షల టన్నుల అంచనా కాగా 6 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేస్తామని అధికారులు ప్రకటించింది. ఇక్కడ కూడా మిగిలిన 3.25 లక్షల టన్నులను మధ్యవర్తులకు విక్రయించాల్సిన పరిస్థితి. ప్రస్తుతానికి 25 వేల ఎకరాల్లో మాసూళ్లు పూర్తికాగా వచ్చే వారం నుంచి ప్రభుత్వ కొనుగోళ్లు జోరందుకునే అవకాశం ఉంది. అయితే ఇప్పటికే తూర్పుగోదావరి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో దళారులు వచ్చి ఇక్కడ ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.

ఇష్టారాజ్యంగా దళారుల కొనుగోలు

కూటమి ప్రభుత్వంలో ధాన్యం కొనుగోళ్లలో దళారులది ఇష్టారాజ్యంగా మారింది. వైఎస్సార్‌సీపీ పాలనలో నూరు శాతం ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయడంతో దళారులకు అడ్డకట్ట పడింది. కూటమి పాలనలో రైతుసేవా కేంద్రాల ద్వారా నచ్చిన మిల్లులో విక్రయించుకోవచ్చని, ఎక్కడైనా అమ్మవచ్చని ప్రభుత్వం ప్రకటించడంతో దళారుల కొనుగోళ్లు గణనీయంగా పెరిగాయి. క్వింటాల్ ఏ–గ్రేడ్ రకానికి రూ.2,320, కామన్ వెరైటీకి రూ.2,300 మద్దతు ధరలను ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇప్పటికే తూర్పుగోదావరి జిల్లాకు చెందిన దళారులు పొలాల్లోనే 75 కేజీల బస్తాను రూ.1,300 నుంచి రూ.1,500 ధరతో కొనుగోలు చేస్తున్నారు.



ఏలూరు జిల్లా	
వరి సాగు	77,466 ఎకరాలు
దిగుబడి అంచనా	3.53 లక్షల టన్నులు
కొనుగోలు లక్ష్యం	2 లక్షల టన్నులు
ధాన్యం కొనుగోలు కేంద్రాలు	183

పశ్చిమగోదావరి జిల్లా	
వరి సాగు	2,19,064 ఎకరాలు
దిగుబడి అంచనా	9.25 లక్షల టన్నులు
కొనుగోలు లక్ష్యం	6 లక్షల టన్నులు
ధాన్యం కొనుగోలు కేంద్రాలు	365

కొనుగోళ్లు మొదలు

ఉమ్మడి పశ్చిమగోదావరిలో రబీ సాగు పూర్తయి ధాన్యం కొనుగోళ్లు జోరందుకున్నాయి. ఏలూరు జిల్లాలో 77,466 ఎకరాల విస్తీర్ణంలో 3.53 లక్షల టన్నులు దిగుబడి అంచనా కాగా 118 రైతు సేవా కేంద్రాలు, 65 ప్రాథమిక సహకార సొసైటీల ద్వారా ఈనెల 2 నుంచి కొనుగోళ్లు ప్రారంభించారు. పశ్చిమగోదావరి జిల్లాలో 2,19,064 ఎకరాల్లో 9.25 లక్షల టన్నులు దిగుబడి అంచనా వేసి 365 రైతు సేవా కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభించారు. పశ్చిమగోదావరి జిల్లాలో 206 రైస్ మిల్లులకు ఇప్పటికే అనుమతులు కూడా ఇచ్చారు.

ని'బంధనాలు'

కొనుగోళ్లలో సరికొత్త నిబంధనలు విధించడం, దిగుబడి కంటే తక్కువ మాత్రమే కొనుగోలు చేస్తుండటంతో క్షేత్రస్థాయిలో సమస్యలు మొదలయ్యాయి. గురువారం జరిగిన జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు కొనుగోళ్లలో ఇబ్బందులున్నాయని, కొన్ని రకాలు కొనుగోలు చేయడం లేదని, ఒత్తిడితో కొనుగోలు చేసినా అతి తక్కువ మాత్రమే కొనడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ సమస్య ఎక్కువగా ఉందని అన్నారు.

తేమ శాతం సాకు

రబీ సీజన్‌లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దిగుబడి అధికంగా వచ్చే పీఆర్–126 రకాన్ని ఎక్కువ సాగు చేశారు. ఎకరాకు సగటున 60 నుంచి 70 బస్తాల దిగుబడి వస్తుండటంతో తేమ శాతం సాకుగా చూపి ఎకరాకు 40 నుంచి 50 బస్తాలు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. అలాగే ఎస్–10 రకం గింజ సరిగ్గా లేదనే కారణంతో కొనుగోలుకు తిరస్కరిస్తున్నారు. దీంతో రైతులు పండించిన పంటలో సగానికి మించి ప్రభుత్వానికి విక్రయించలేని పరిస్థితి ఉండటంతో దళారులను తప్పనిసరిగా ఆశ్రయిస్తున్నారు.

న్యూస్‌రీల్

బంగారం షాపుల్లో సోదాలు



కాటాను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

నరసాపురం: పట్టణంలోని బంగారం షాపులపై శుక్రవారం జీఎస్టీ, తూనికలు, కొలతలు, విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. విజిలెన్స్ సీఐ కె.శివరామకృష్ణ వివరాలను వెల్లడించారు. జైన్ జ్యూయల్ పార్క్ షాపులో 622.37 గ్రాముల బంగారం, 4,907 గ్రాముల వెండి స్టాక్ రిజిస్టర్‌లో కన్నా తక్కువగా ఉన్నట్టుగా గుర్తించి జీఎస్టీ అధికారులు రూ.3,51,004 అపరాధ రుసుం విధించారన్నారు. అలాగే ఎలాంటి ధ్రువీకరణ లేని ఎలక్ట్రానిక్ కాటాను గుర్తించి తూనికలు, కొలతల అధికారులు రూ.25 వేలు అపరాధ రుసుం విధించారని చెప్పారు. అంబిక సంఘవి జ్యూయల్ షాపులో ఎలాంటి ధ్రువీకరణ లేని ఎలక్ట్రానిక్ కాటా గుర్తించి రూ.25 వేలు ఫైన్ వేసినట్టు తెలిపారు. సోదాల్లో విజిలెన్స్ ఎస్సై కె.సీతారాము, తూనికలు, కొలతలు అధికారి డి.రాంబాబు, జీఎస్టీ అధికారి జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జిల్లా జడ్జి సోమశేఖర్ బదిలీ

భీమవరం: భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి ఎంఏ సోమశేఖర్ బదిలీ అయ్యారు. మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్‌గా పనిచేస్తున్న ఆయన్ను నెల్లూరు 8వ అదనపు జిల్లా జడ్జిగా మహిళా కేసుల నేర విచారణ ప్రత్యేక కోర్టుకు బదిలీ చేశారని కోర్టు అధికారులు శుక్రవారం తెలిపారు. ఆయన స్థానంలో భీమవరం పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బి.లక్ష్మీనారాయణకు బాధ్యతలు అప్పగించారన్నారు.

లెక్చరర్ల సంఘం ఏకగ్రీవం



ఏకగ్రీవంగా ఎంపికైన సభ్యులు

పెంటపాడు: జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ల సంఘ ఎన్నికలు ఆదివారం తణుకులో జరిగాయని, అధ్యక్షుడిగా తనను ఎన్నుకున్నట్టు పెంటపాడుకు చెందిన ఎంఈఓ దేవరాజు ప్రకటనలో తెలిపారు. 2025–28 కాలానికి సంబంధించి ఎన్నికల్లో భాగంగా ముందుగా సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చించామని పేర్కొన్నారు. అధ్యక్షుడిగా తనను, ఉపాధ్యక్షుడిగా బి.వాయునందనరావు (తణుకు), కార్యదర్శిగా వి.పద్మావతి (అత్తిలి), సహాయ కార్యదర్శిగా ఎల్.శ్రీనివాస్ (తణుకు), కోశాధికారిగా కె.మురళీకృష్ణ (పాలకొల్లు), మహిళా సెక్రటరీగా ఎండీ జబీన్ (పాలకొల్లు), స్టేట్ కౌన్సిలర్‌గా వి.నాగమణి (తాడేపల్లిగూడెం)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు.

రోడ్లపై చెత్త వేస్తే చర్యలు



చిరు వ్యాపారులతో మాట్లాడుతున్న జేసీ

భీమవరం(ప్రకాశం చౌక్): షాపులు నిర్వాహకులు, చిరువ్యాపారులు రోడ్ల పక్కన, రోడ్ల కూడలిలో చెత్త వేస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. ప్లాస్టిక్ కవర్ల వాడకంపై చిరు వ్యాపారులను ప్రశ్నించారు. పలు ప్రాంతాల్లో చెత్త నిషేధ బోర్డులు పెట్టి పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు ఉన్నారు.

ప్రభుత్వాస్పత్రి పరిశీలన : రోగులకు మెరుగైన చికిత్సను అందించడంతోపాటు ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జేసీ ఆదేశించారు. భీమవరం ఏరియా ఆస్పత్రిని ఆయన తనిఖీ చేసి పారిశుద్ధ్య నిర్వహణ, ఆస్పత్రి పరిసరాలను, విభాగాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. డాక్టర్ జి.మాధవి కల్యాణి, ఆర్ఎం కె.ప్రవీణ్ కుమార్, వైద్యులు ఉన్నారు.

శ్రీవారి దేవస్థానం సూపరింటెండెంట్‌గా రామారావు

ద్వారకాతిరుమల: అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం సూపరింటెండెంట్ ఐవీ రామారావు ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం రామారావు ఇక్కడ చార్జ్ తీసుకోనున్నారు.

● కరుణ రూపం.. శాంతి సందేశం



శాంతి, సహనం, కరుణకు ప్రతీకగా గుడ్‌ఫ్రైడేను క్రైస్తవ విశ్వాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లావ్యాప్తంగా క్రైస్తవ మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. క్రీస్తు సందేశాన్ని వివరిస్తూ విశ్వాసులు ర్యాలీలు నిర్వహించారు. తాడేపల్లిగూడెం మండలం పెద తాడేపల్లిలో శిలువతో ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వాసులు - తాడేపల్లిగూడెం రూరల్

ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ

భీమవరం(ప్రకాశం చౌక్): స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామ పంచాయతీల్లో ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్టు డీపీఓ బి.అరుణశ్రీ తెలిపారు. పంచాయతీ కార్యాలయాల వద్ద కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఎలక్ట్రానిక్ వ్యర్థాలు సేకరిస్తామన్నారు. జిల్లాలో 20 పంచాయతీల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నామని, ప్రజలు వినియోగంలో లేని టీవీలు, మిక్సీలు, గ్రైండర్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, మొబైల్స్, కంప్యూటర్ విడి భాగాలు, ప్రింటర్లు, కేబుల్స్ వంటివి అందజేయాలని సూచించారు. పెనుగొండ, సిద్ధాంతం, అత్తిలి, వేల్పూరు, ఆచంట, మొగల్తూరు, ఉండి, రేలంగి, గణపవరం, పెంటపాడు, వీరవాసరం, శృంగవృక్షం, పోడూరు, రాయలం, యలమంచిలి, పెద అమిరం, లంకలకోడేరు, పెనుమంట్ర, పెద తాడేపల్లి పంచాయతీల వద్ద ఈ కేంద్రాలను ఏర్పాటుచేస్తామని డీపీఓ అరుణశ్రీ వివరించారు.

మద్యం మత్తులో ముంచుతున్న ప్రభుత్వం

మాజీ మంత్రి కారుమూరి ధ్వజం



తణుకులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: రాష్ట్రాన్ని మద్యం మత్తులో ముంచేస్తూ ఇది మంచి ప్రభుత్వంగా కూటమి సర్కారు పేరు సంపాదించిందని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సూపర్ సిక్స్ అన్నారు.. సంక్రాంతికి రోడ్లన్నీ వేసేస్తామన్నారు.. కరెంటు బిల్లులు పెంచమన్నారు.. ఇవేమీ జరగలేదు కానీ మద్యం మాత్రం విచ్చలవిడిగా నైట్ పాయింట్‌ల ద్వారా 24 గంటలు అమ్మిస్తూ అమాయకుల ప్రాణాలు బలి తీసుకుంటున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో జగన్ పారదర్శకంగా పథకాలు అందించారని, కూటమి పాలనలో సూపర్‌సిక్స్ అమలు చేయకుండా, ప్రశ్నించిన వారిపై కేసులు, దాడులకు పాల్పడుతూ భయభ్రాంతులను సృష్టిస్తున్నారని విమర్శించారు.

ఆరిమిల్లీ నాకు సంస్కారం ఉంది

తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తనను ఇష్టానుసారంగా దూషించారని, చదుకున్న అజ్ఞానిగా ఉన్నారంటూ కారుమూరి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను కూడా దూషించగలనని, అయితే సంస్కారం ఉంది కాబట్టే సంస్కారవంతంగా సమాధానం చెబుతున్నానని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో పేకాటలు, కోతాటలు ఇళ్లలోనే నిర్వహిస్తున్నారని కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నాయని, తణుకులో ఒక టీడీపీ నేత హోటల్‌లోనే కోతాటలో 45 మందిని జిల్లాస్థాయి పోలీసు ఉన్నతాధికారులు పట్టుకున్నారని గుర్తుచేశారు. ప్రశాంతంగా ఉండే తణుకులో గంజాయి విచ్చలవిడి అయిపోయిందని దాడులు, చోరీలకు నిలయంగా మారిందని విమర్శించారు. గత టీడీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ టీడీఆర్ బాండ్ల జారీలో రూ.800 కోట్లు డబ్బులు తీసుకున్నారని ప్రజలే చెప్పుకుంటున్నారని ఆరోపించారు. వారానికోసారి తణుకు వచ్చి ప్రెస్‌మీట్ పెట్టి తనపై విమర్శలు చేస్తున్నారని కారుమూరి ధ్వజమెత్తారు. నాది రాష్ట్రస్థాయి.. నీది తణుకు నియోజకవర్గస్థాయి మాత్రమే అని ఆరిమిల్లికి చురకలు వేశారు. ఆరిమిల్లి భాష మార్చుకోవాలని లేకుంటే ప్రజలు రోడ్లపై తిరగనివ్వరని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేసిన కార్యకర్తలందరికీ కారుమూరి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ లీగల్ సెల్ సభ్యుడు వెలగల సాయి బాబారెడ్డి, పంచాయతీరాజ్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు ఫణీంద్రకుమార్ వీరమల్లు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక నిఘా



తనిఖీలు చేస్తున్న ఎస్పీ నయీం అస్మి

భీమవరం: ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించి, నేర నియంత్రణే లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. జిల్లాలో గురువారం రాత్రి 9 గంటల నుంచి 11 గంటల వరకు విజిబుల్ పోలిసింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమవరం కొత్త బస్టాండ్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎస్పీ స్వయంగా తనిఖీలు చేశారు. వాహనాలను తనిఖీ చేసి డ్రంక్ అండ్ డ్రైవ్, గంజాయి అక్రమ రవాణా, రోడ్డు భద్రత నియమాల ఉల్లంఘనలపై సిబ్బందికి సూచనలు ఇచ్చి కేసులు నమోదు చేశారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై దృష్టి సారించాలన్నారు. డీఎస్పీ ఆర్.జయసూర్య, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, సీఐ ఎం.నాగరాజు ఉన్నారు.

పంట నష్టపరిహారం ఏదీ?

- గత జూలైలో 13 వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- సార్వా సీజన్‌లో భారీ వర్షాలు, వరదలతో అవస్థలు
- 9,918 మంది రైతులకు ఇప్పటికీ అందని పరిహారం
- దాళ్వా సీజన్ ముగుస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం

పంట నష్టం.. అందించాల్సిన పరిహారం	
కాలం	రైతులు
జూలై 2024	9,918
ఎకరాలు	పరిహారం
13,084	రూ. 9 కోట్లు



సార్వా సీజన్‌లో అత్తిలి మండలం మంచిలిలో వర్షాలకు దెబ్బతిన్న వరినాట్లు (ఫైల్)

భీమవరం: రాష్ట్రంలో అన్నదాతల సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం రైతు భరోసా సాయాన్ని అందించకపోగా విపత్తులతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం కూడా మంజూరు చేయడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో గతేడాది జూలైలో భారీ వర్షాలు, వరదలకు పంటలు దెబ్బతిన్న రైతులకు ఇప్పటికీ ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదు. సార్వా సీజన్‌లో జిల్లాలో సుమారు 2.40 లక్షల ఎకరాల్లో వరి సాగు చేపట్టగా జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షాలు, వరదలు ఇబ్బంది పెట్టాయి. మొత్తంగా 21,500 ఎకరాల్లో వరినాట్లు దెబ్బతిన్నాయి. అప్పటికే నాట్లు ఆలస్యం కావడం, వర్షంతో నాట్లు దెబ్బతినడంతో రైతులు ఇతర ప్రాంతాల నుంచి ఎక్కువ ధరకు నాట్లు తీసుకువచ్చి మరలా నాట్లు వేశారు. దీంతో పెట్టుబడులు బాగా పెరిగాయి. జూలై నెలలో వర్షాల కారణంగా జిల్లాలో 13,084 ఎకరాల్లో వరినాట్లు దెబ్బతిన్నాయని, 9,918 మంది రైతులకు సుమారు రూ.9 కోట్లు పరిహారం అందించాలని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అలాగే ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లోనూ వర్షాలకు పంటలు దెబ్బతినగా వాటికి సంబంధించి పరిహారం అందించిన ప్రభుత్వం జూలైలో దెబ్బతిన్న పంటల రైతులకు మాత్రం మొండిచేయి చూపింది. దీనిపై రైతులు వ్యవసాయ అధికారులను ప్రశ్నిస్తే నివేదిక తయారీలో సర్వర్ సమస్య ఏర్పడిందని సర్దిచెప్పారు. సార్వా సీజన్‌తో పాటు దాళ్వా సీజన్ ముగుస్తున్నా ఇప్పటికీ తమకు పరిహారం అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంకెప్పుడిస్తారు ?



మాది అత్తిలి మండలం బల్లిపాడు. సార్వా సీజన్‌లో 4 ఎకరాల్లో వరి నాట్లు వేశాను. మొదటి విడత ఎరువులు వేసిన తర్వాత భారీవర్షాలకు వరినాట్లు నీట మునిగి పూర్తిగా నష్టపోయాను. అధికారులు పంట నష్టపరిహారం ఇస్తారని చెప్పారు. ఇప్పటివరకూ ఎలాంటి పరిహారం అందించలేదు.

–వేంద్ర త్రినాథ్, బల్లిపాడు

అప్పులు చేసి నాట్లు




సార్వా సీజన్‌లో భారీ వర్షాలకు రెండు ఎకరాల్లో నాట్లు కుళ్లిపోయాయి. అప్పులు చేసి పోగు వరినారు రూ.200కి కొని మరలా నాట్లు వేశాం. పంట దిగుబడి కూడా అంతంత మాత్రంగానే వచ్చింది. ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తే కొంతమేరకు అప్పులు తీర్చుకోవచ్చని ఆశించగా ఇప్పటివరకు పరిహారం మాటే లేదు.

– వీరవల్లి మంగమ్మ, అత్తిలి మండలం

పోలీసులపై మంత్రి అసహనం

చెప్పిన పనులు చేయడం లేదంటూ నిమ్మల ఆగ్రహం



పాలకొల్లు సెంట్రల్: 'పోలీసులూ.. ఎందుకయ్యా నా చుట్టూ తిరుగుతారు.. మీరు స్టేషన్లలో ఉండి ప్రజలకు సేవ చేయండి.. (చెప్పింది చేయరు గాని) నా చుట్టూ చక్కర్లు కొట్టకండి.. నాకు సెక్యూరిటీ అవసరం లేదు..' అంటూ మంత్రి నిమ్మల రామానాయుడు పోలీసులపై అసహనం వ్యక్తం చేశారు. పోడూరు, యలమంచిలిలో మంత్రి అధికారిక కార్యక్రమంలో బందోబస్తులో ఉన్న ఎస్సైలు, కానిస్టేబుళ్లపై ఇలా విరుచుకుపడ్డారు. నాలుగు రోజుల క్రితం ఇదే రీతిలో పాలకొల్లు టౌన్ సీఐపైనా అసహనం వ్యక్తం చేశారు. అంతకు ముందు రూరల్ సీఐపై, డీఎస్పీపై ఇలానే అసహనం వ్యక్తం చేయడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

తాను చెప్పిన పనులు చేయలేదంటూ..

మంత్రి నిమ్మల పోలీసుల తీరుపై తీవ్ర ఫ్రస్టేషన్‌లో ఉన్నారు. తాను చెప్పిన పనులు చేయడం లేదని.. ప్రజలకు సేవ చేసుకోండి అంటూ తరచూ సెటైర్లు వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో సీఐ, ఎస్సైల పోస్టింగ్‌లు నిమ్మల కనుసన్నల్లోనే జరిగాయి. ఈ క్రమంలో ఇటీవల యలమంచిలి ఎంపీపీ ఉప ఎన్నికల సమయంలో పోలీసులు తనకు సహకరించలేదని, తాను చెప్పినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి కనీసం నలుగురిని కూడా లోపల వేయలేకపోయారంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఉన్నతాధికారుల వద్ద ఇదే అసంతృప్తిని వ్యక్తం చేయడంతో సదరు అధికారి అడ్డగోలుగా పనిచేయలేమంటూ బదులివ్వడం మంత్రి ఆగ్రహానికి కారణమనే ప్రచారం సాగుతోంది. దీనిపై పోలీస్ శాఖ తర్జనభర్జనల అనంతరం తప్పనిసరిగా మూడు కేసులు నమోదు చేశారు. అయినా మంత్రికి ఆగ్రహం తగ్గలేదని సమాచారం.

ఎస్కార్ట్ వద్దంటూ.. శుక్రవారం పోడూరు, యలమంచిలిలో ఎస్సైలపై మంత్రి నిమ్మల ఆగ్రహం వ్యక్తం చేసి, వెళ్లిపోండని హుకుం జారీ చేయగా ఏం చేయాలో తెలియక వారు మంత్రి కార్యక్రమానికి కొద్ది దూరంలో విధులు నిర్వహించారు. నాలుగు రోజుల క్రితం పట్టణంలోని ఓ రోడ్డులో ముగ్గు వేసి టెంట్ ఉండటంతో మంత్రి కాన్వాయ్‌ని సీఐ అటుగా తీసుకువెళ్లారు. అయితే ఆ కార్యక్రమానికి మంత్రికి ఆహ్వానం లేకపోవడంతో 'దారీతెన్నూ లేకుండా రోడ్లన్నీ తిప్పుతున్నారు.. మీరంతా నాతో రావాల్సిన పని లేదు.. మీరు వచ్చి సందులన్నీ తిప్పి నా టైం వేస్ట్ చేస్తున్నారు, కనీసం రూట్ మ్యాప్ కూడా తెలియకుండా ఏం పని చేస్తారు వెళ్లిపోండి' అంటూ మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై మంత్రి కార్యాలయం పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చింది. మంత్రి తనకు ఎస్కార్ట్ అక్కర్లేదని చెప్పడంతో ఏం జరిగిందనే దానిపై శాఖాపరంగా పరిశీలిస్తున్నారు.

క్లుప్తంగా

మే 10, 11 తేదీల్లో తెలుగు సాహితీ సంబరాలు



ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల వాల్ పోస్టర్‌లు విడుదల చేస్తున్న శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో వచ్చే మే నెల 10, 11 తేదీల్లో ఏలూరులో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు కార్యక్రమం జయప్రదం చేయాలని శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ కోరారు. స్థానిక మహాలక్ష్మి గోపాలస్వామి కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో సాహితీ సంబరాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీ కళావేదిక ద్వారా ఇంతవరకూ వివిధ ప్రాంతాలలో 147 శతాధిక కవి సమ్మేళనాలు నిర్వహించి 148వ కార్యక్రమాన్ని ×ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల్లు పేరుతో మే నెల 10, 11 తేదీల్లో ప్రపంచ రికార్డు స్థాయిలో ఏలూరులో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు కొల్లిరమావతి, జీ.ఈశ్వరీ భూషణం, టీ.పార్థసారథి, శ్రీహరికోటి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ట్రస్ట్‌కు రూ.18 లక్షల విరాళం



ఈఓకు విరాళం చెక్కు అందజేస్తున్న నెక్స్‌జెన్ కంపెనీ ఎండీ సుబ్రహ్మణ్యం, ప్రతినిధులు

ద్వారకాతిరుమల: దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్ కంపెనీ ఎండీ అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం, కంపెనీ ప్రతినిధులు శుక్రవారం నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.18 లక్షలను జమ చేశారు. ఈ విరాళం చెక్కును ఆలయ ఈఓకు అందించారు. ఈఓ వారికి కండువాలు కప్పి ఘనంగా సత్కరించగా, ఆలయ అర్చకులు, పండితులు వేద ఆశీర్వచనాన్ని, ప్రసాదాలను అందజేశారు. అంతకు ముందు దాతలు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఇంతవ వరకు నెక్స్‌జెన్ నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.1,29,08,007లు అందించినట్టు ఈఓ తెలిపారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో లారీ ఢీకొనడంతో యువకుడు మృతి చెందడంతో శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కాకినాడ జిల్లా ప్రత్తిపాడుకు చెందిన అడ్డాల చిన్న (24) హైదరాబాద్‌లో జిమ్ ట్రైనర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం తన సొంతూరు ప్రత్తిపాడుకు హైదరాబాద్ నుంచి ద్విచక్రవాహనంపై వస్తుండగా లోసరి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో తలకు, కాళ్లకు బలమైన గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. అడ్డాల చిన్న అన్నయ్య ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉండిలో గంజాయి స్వాధీనం

ఉండి : ఉండి పోలీసులు 1650 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం శుక్రవారం ఉండి శివారు ఉప్పుగుంటకు వెళ్ళే రహదారి పక్కన డంపింగ్‌యార్డు వద్ద ఓ స్థలంలో గంజాయి ముఠా ఉన్నట్లు ముందస్తు సమాచారం రావడంతో ఎస్సై ఎండీ నసీరుల్లా ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. గంజాయి పంపిణీ చేస్తుండగా.. దాడి చేశామని ఉండి, భీమవరం, ఆకివీడు మండలాలకు చెందిన 11 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 1650 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు.

ప్రభుత్వాసుపత్రికి సుస్తీ

- పనిచేయని ఏసీలు, పాడైన బెడ్లు
- టాయిలెట్లు సరిగా లేక ఇక్కట్లు
- అవస్థలు పడుతున్న రోగులు, బాలింతలు

భీమవరం(ప్రకాశం చౌక్) : పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం వల్ల జిల్లా కేంద్రమైన భీమవరం ప్రభుత్వ ఆస్పత్రి సమస్యలతో సతమతమవుతోంది. సరిగా పనిచేయని ఏసీలు, పాడైన బెడ్లు, సరైన సౌకర్యాలు లేని టాయిలెట్లతో పేషెంట్లు అవస్థలు పడాల్సి వస్తోంది. 50 పడకల సదుపాయం ఉన్న ఈ ఆస్పత్రికి భీమవరం, ఉండి, నర్సాపురం నియోజకవర్గాలతో పాటు కృష్ణా జిల్లాలోని సమీప గ్రామాల నుంచి ప్రజలు వస్తుంటారు. రోజూ 400కు పైగా ఓపీ నమోదవుతుంటే ఆస్పత్రిలో చేరే పేషెంట్లు సంఖ్య నెలకు 200 వరకు ఉంటుంది. ఆస్పత్రిలో రెండు బాలింతల వార్డులు, ఇతర రోగులకు మూడు వార్డులు ఉన్నాయి. బాలింతల వార్డుల్లో నాలుగు ఏసీలకు గాను రెండు మొత్తానికి పనిచేయకుండా నిరుపయోగంగా మిగిలాయి. మరో రెండు తరచూ మరమ్మతులతో అక్కరకు రావడం లేదు. ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రత, ఉక్కపోత వల్ల ఫ్యాన్లు ఉన్నా వేడి గాలులకు బాలింతలు, శిశువులు విలవిల్లాడాల్సి వస్తోంది. బాలింతలు, రోగుల వార్డుల్లోని మంచాలపై ఉన్న పరుపులు చిరిగిపోయాయి. ఎత్తుపల్లాలుగా ఉన్న వాటిపై పడుకోవడానికి బాలింతలు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బెడ్‌పై చంటి బిడ్డతో పడుకోవడానికి సరిపోవడం లేదని బాలింతలు అంటున్నారు. శిశువుల కోసం బెడ్ పక్కన బాస్కెట్ బెడ్‌ల సౌకర్యం లేదు.

వేధిస్తున్న సౌకర్యాల కొరత

ఆస్పత్రిలోని వార్డుల్లో టాయిలెట్స్, ఆవరణలోని అవుట్ పేషెంట్లు కోసం ఏర్పాటుచేసిన టాయిలెట్లలో సరైన సౌకర్యాలు లేక బాలింతలు, వారి సహాయకులు, పేషెంట్లు ఇబ్బందులు పడుతున్నారు. వైద్యం కోసం వచ్చిన అవుట్ పేషెంట్లు, గర్భిణులు కూర్చునేందుకు కుర్చీలు, బెంచీలు లేవు. ఎక్స్‌రే విభాగం వద్ద కూర్చునేందుకు సదుపాయాలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు.. మరోపక్క ఆస్పత్రిలో మంచినీటి సౌకర్యం పూర్తి స్థాయిలో లేదు. బాలింతలు, పేషెంట్లు మంచినీళ్లు బయట నుంచి తెచ్చుకుని తాగుతున్నారు.



భీమవరం ప్రభుత్వ ఆస్పత్రిలో ఉక్కపోతలోనే బాలింతలు



చిరిగిపోయిన బెడ్‌లు

జేసీ రావడంతో బెడ్ షీట్‌లు మార్చారు

బాలింతల వార్డుల్లో బెడ్‌లపై కనీసం బెడ్‌షీట్‌లు వేయడం లేదు. బాలింతలు ఇంటి నుంచి తెచ్చుకున్న దుప్పట్లు, బెడ్ షీట్‌లు వేసుకుంటున్నారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ విజిట్‌కు రావడంతో అప్పటికప్పుడు ఆస్పత్రి సిబ్బంది బాలింతల వార్డులో బెడ్ షీట్‌లు వేశారు.

పట్టించుకోని అధికారులు:

ప్రభుత్వ ఆస్పత్రిని సమస్యలు పీడిస్తున్నా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఆస్పత్రిలో సమస్యలను పరిష్కరించి రోగులకు అవసరమైన వసతులు కల్పించే దిశగా కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు చొరవ చూపడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలో ఆస్పత్రి స్థితిగతులపై అధికారులతో సమీక్షించిన దాఖలాలు లేవు.

టాయిలెట్స్‌లో సౌకర్యాలు లేక ఇబ్బందులు



భీమవరం ప్రభుత్వ ఆస్పత్రిలో మా పాపకు డెలివరీ అయ్యింది. ఆస్పత్రిలో వారం రోజుగా ఉంటున్నాం. బాలింతల వార్డులో ఉన్న టాయిలెట్స్‌లో సరైన సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారు. నీళ్ల సక్రమంగా రావడం లేదు. బాలింతలు టాయిలెట్లకు వెళితే ఇబ్బంది పడుతున్నారు. ఏసీలు ఒకటి పనిచేస్తే మరొకటి పనిచేయడం లేదు.

– కె.సుభాషిణి, మొగల్తూరు

పాడైన బెడ్‌లపై ఎలా పడుకునేది?



బాలింతలు పడుకునే బెడ్‌లు దెబ్బతిన్నాయి. చిరిగిపోయి, గుంతలు పడ్డాయి. వాటిపై బాలింతలు పడుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. బెడ్‌పై తల్లీ బిడ్డ పడుకోవడానికి సరిపోక ఇబ్బంది పడుతున్నారు. తల్లి బెడ్ పక్కన చంటి బిడ్డకు ఊయల సౌకర్యం కల్పించాల్సి ఉన్నా చర్యలు లేవు.

– ఎ.అన్నమ్మ, మోగల్లు

అలరిస్తున్న నాటిక పోటీలు



హక్కు నాటికలోని సన్నివేశం

భీమవరం: భీమవరం కళారంజని నాటక అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి తెలుగు నాటిక పోటీలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. శ్రీసోమేశ్వర, జనార్దన స్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న ఈ నాటిక పోటీలో మూడో రోజు శుక్రవారం రాత్రి రెండు నాటికలు ప్రదర్శించారు. అనంతరం హైదరాబాదుకు చెందిన ప్రముఖ రంగస్థల నటీమణి ఎస్.మాధవికి మహానటి సావిత్రి స్మారక పురస్కారం, కళారంజని యువతేజం పురస్కారాన్ని హైదరాబాద్‌కు చెందిన మంజునాథ్‌కు అందించారు. సమాజంలోని కుటుంబాలు, ప్రేమ, ఆదరణ కన్నా ఆస్తుల కోసం, హక్కుల కోసం కుటుంబాల మధ్య జరుగుతున్న సంఘర్షణలు ప్రతిరూపంగా సాగిన హక్కు నాటిక ఆకట్టుకుంది. రెండో నాటికగా సౌజన్య కళాస్రవంతి వారి దేవరాగం ప్రదర్శించారు.

దాడి కేసులో ముగ్గురి అరెస్టు

ముదినేపల్లి రూరల్: వ్యక్తిపై దాడి ఘటనలో స్థానిక పోలీసులు ముగ్గురిని శుక్రవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని సింగరాయపాలెంకు చెందిన చేబోయిన పోతురాజుపై అదే గ్రామానికి చెందిన బి.రాధాకృష్ణ, కుమారులు కుమారస్వామి, ఏడుకొండలు గత నెల 2 దాడి చేసి గాయపరిచినట్లు చెప్పారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ నిమిత్తం తరలించినట్లు చెప్పారు.

రైతులకు తీరని అన్యాయం

బుట్టాయగూడెం: కూటమి ప్రభుత్వ పాలనలో రైతులకు తీరని అన్యాయం జరుగుతోందని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంలో ఆయన శుక్రవారం పర్యటించారు. ఇటీవల అకాల వర్షాలకు దెబ్బతిన్న పొగాకు, వేరుశనగ, మొక్కజొన్న పంటలను మండల పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. పంట నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలరాజు మాట్లాడుతూ.. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో వేరుశనగ పంటను రూ.9,200కు కొనుగోలు చేశారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రూ.6,500 ధరతో కొనుగోలు చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. పొగాకు రైతులకు కూడా గిటుబాటు ధర లభించక కష్టాల ఊబిలో కూరుకు పోయే పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరి పండించిన రైతులకు ఆ పంటను విక్రయించేందుకు తగినన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం లేదన్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలిచారని గుర్తు చేశారు. రైతు భరోసా సొమ్ములు చెల్లించకపోవడం వల్ల పెట్టుబడి కోసం అప్పుల పాలయ్యారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ చందా ప్రసాద్, నాయకులు ఉప్పల రాంపండు, ములకాల బాబు, తట్టుకొల్ల అంజి తదితరులు పాల్గొన్నారు.



జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంలో పంటలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

లింగపాలెం కూటమిలో లుకలుకలు

లింగపాలెం: కూటమి ప్రభుత్వం గెలుపునకు బీజేపీ కార్యకర్తలు కష్టపడితే బీజేపీ నాయకులు, కార్యకర్తలను టీడీపీ శ్రేణులు విస్మరిస్తున్నాయని లింగపాలెం బీజేపీ నాయకులు శుక్రవారం లింగపాలెం మండలంలో జరిగిన సమావేశంలో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ టీడీపీ నేతలు పట్టించుకోవడం లేదని, ప్రోటోకాల్ పాటించడం లేదని ఆరోపించారు. ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లినా లెక్కచేయడం లేదని పేర్కొన్నారు. ఇటీవల ప్రకటించిన బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరు విషయంలో తమను సంప్రదించకుండా, తాము సూచించిన పేర్లను పరిగణలోకి తీసుకోకుండా ఇష్టం వచ్చిన వారికి రుణాలను కేటాయిస్తున్నారని ఆరోపించారు. చింతలపూడి నియోజకవర్గంలో బీజేపీ ఉందా? లేదా? అనేలా ఉందని, దీనిపై బీజేపీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని నాయకులు అన్నారు. మండలంలో కూటమి ప్రభుత్వం తరఫున టీడీపీకి చెందిన కొంత మంది అవకతవకలకు పాల్పడుతూ దందాలు చేస్తున్నారని ఆరోపించారు. మండలంలో మట్టి దందా, సివిల్ సప్లయిస్ దందా, పేదలకు ఇచ్చే రుణాలపై కమిషన్‌లు ఇలా అనేక దందాలు చేస్తున్నారని ఆరోపించారు. అవినీతి దందాను ప్రజల్లోకి తీసుకువెళతామని హెచ్చరించారు.

అంబేడ్కర్ ఫ్లెక్సీ చింపిన ముగ్గురిపై కేసు

ద్వారకాతిరుమల: మండలంలోని దొరసానిపాడులోఅంబేడ్కర్ ఫ్లెక్సీని చించిన ముగ్గురు వ్యక్తులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదయ్యింది. ఎస్సై టి.సుధీర్ తెలిపిన వివరాలు ప్రకారం.. దొరసానిపాడు గ్రామంలో అంబేడ్కర్ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఈనెల 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమిటీ సభ్యులు ఎం.సునీల్‌కుమార్ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈనెల 15 రాత్రి అదే గ్రామానికి చెందిన బిరుదుగడ్డ కల్యాణ్, పసుపులేటి కల్యాణ్‌ల ప్రోద్బలంతో పొడుదోలు అజయ్ అంబేడ్కర్ ఫ్లెక్సీని రాయితో కొట్టి, చింపివేశాడు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించి, కుల, మతాల మధ్య వర్గ విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నించిన ముగ్గురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ద్వారకానగర్‌లోని ఇంట్లో చోరీ

ద్వారకాతిరుమల: మండలంలోని ద్వారకానగర్‌లో ఓ ఇంట్లో జరిగిన చోరీ ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం రాత్రి కేసు నమోదయ్యింది. ఏఎస్సై అమీర్ తెలిపిన వివరాలు ప్రకారం. ఎం.నాగులపల్లి పంచాయతీ పరిధిలోని ద్వారకానగర్‌కు చెందిన చేకుర్తి గోపాల పవన్‌కుమార్ ఈనెల 16న సాయంత్రం 5 గంటలకు ఇంటికి తాళాలు వేసి భార్యాపిల్లలను తీసుకుని ఫంక్షన్ నిమిత్తం దేవులపల్లికి వెళ్లాడు. 17న మధ్యాహ్నం ఇంటి ఓనర్ కోడలు గోపాల పవన్‌కుమార్‌కు ఫోన్ చేసి ఇంటి తలుపులు పగలగొట్టి, బీరువా లుపులు తెరచి ఉన్నాయని చెప్పింది. దాంతో వెంటనే గోపాల పవన్‌కుమార్, అతని భార్యతో కలిసి ఇంటికి చేరుకున్నారు. బీరువాలో పెట్టిన 2 కాసుల చైన్, ఉంగరం, బ్రాస్‌లెట్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్టు గుర్తించి, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పాఠశాల విద్యలో ప్రయోగాలతో తీరని నష్టం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యారంగంలో చేస్తున్న ప్రయోగాలు విద్యార్థులకు తీరని నష్టం చేసేలా ఉన్నాయని ఏపీటీఎఫ్ నాయకులు ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాశాఖ నూతన విధానాలు విద్యా రంగానికి మేలు చేసేలా ఉండాలని, ప్రాథమిక పాఠశాల స్వరూపాన్ని మార్చడం సరైన విధానం కాదన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు ఉండాలని, ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలని, విద్యార్థుల సంఖ్య 20 దాటితే మూడో పోస్టు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10 తరగతులు మాత్రమే ఉండాలని, 30 మందికి ఒక సెక్షన్ ఉండాలన్నారు. రాబోయే విద్యా సంవత్సరం నుంచి 1557 పాఠశాలల్లో ఒకటి నుంచి పది తరగతుల వరకు కొనసాగించాలని నిర్ణయించడం సరైనది కాదన్నారు. రాష్ట్రంలో ఫౌండేషన్ స్కూల్స్ పేరుతో దాదాపు 5 వేల పాఠశాలలను కేవలం ఒకటి రెండు తరగతులతో నిర్వహించడం వల్ల సింగిల్ టీచర్ పాఠశాలలు అవుతాయన్నారు. సింగిల్ టీచర్‌తో నాణ్యమైన విద్య ఏ విధంగా అందుతుందో చెప్పాలని ఏపీటీఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాళ్లూరి రామారావు బీ.రెడ్డి దొర తదితరులు డిమాండ్ చేశారు.

సచివాలయ వ్యవస్థ నిర్వీర్యానికి కుట్ర

- జనాభా ప్రాతిపదికన రెండు కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు
- ఉమ్మడి పశ్చిమ పరిధిలో 1,165 సచివాలయాలు
- 582కే పరిమితం చేసేలా పావులు

బుట్టాయగూడెం: మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశ పెట్టారు. ప్రజలకు మంచి పాలనను చేరువ చేసే దిశగా ఇంటి వద్దకే సేవలందించేలా చర్యలు తీసుకున్నారు. గ్రామ, వార్డుల పరిధిలో నివసిస్తున్న ప్రజలకు ప్రభుత్వ సేవల్లో ఎలాంటి కష్టం కలగకుండా విస్తృత సేవలందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రకు కూటమి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. గ్రామ సచివాలయాల కుదింపునకు రంగం సిద్ధం చేసింది. జనాభా ప్రాతిపదికన సచివాలయాలు ఉండేలా చర్యలు చేపట్టింది. క్లస్టరైజేషన్‌లో భాగంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రస్తుతం ఉన్న 1,165 గ్రామ సచివాలయాలు సగానికి తగ్గించి 582కే పరిమితం చేయనున్నారు. సచివాలయాల్లో పని చేస్తున్న సిబ్బందిని గ్రేడ్‌ల వారీగా సర్దుబాటు చేయనున్నారు. ప్రభుత్వ చర్యలతో ఇటు ప్రజలు, అటు సచివాలయ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

దేశానికే ఆదర్శం సచివాలయ సేవలు

వైఎస్సార్‌సీపీ పాలనలో ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయాల సేవలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 1,165 సచివాలయాలు ఏర్పాటు చేశారు. ఈ సచివాలయాల ద్వారా సుమారు 142 సేవలు గ్రామాల్లోని ప్రజలకు అందించేలా చర్యలు తీసుకున్నారు. 938 గ్రామ సచివాలయాలు, 227 వార్డు సచివాలయాల్లో 8,468 మంది సచివాలయ సిబ్బందితో పాటుగా పంచాయతీ కార్యదర్శులను సైతం కేటాయిస్తూ చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,165 గ్రామ సచివాలయాల్లో 9,099 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. సచివాలయల్లో డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, సిబ్బంది, కార్యదర్శి అందుబాటులో ఉండేవారు. వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్లకు ప్రత్యేక కంప్యూటర్లను సైతం కేటాయించారు. కంప్యూటర్లకు ఇంటర్నెట్ సదుపాయం కల్పించారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించేలా కృషి చేసేవారు. అయితే కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న క్లస్టర్ విధానంతో గ్రామ స్థాయిలో అందే సేవలపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

రెండు సచివాలయాలు కలిపి..

గ్రామ సచివాలయాలను క్లస్టర్‌గా మార్చేందుకు కూటమి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుంది. ప్రతి రెండు సచివాలయాలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేస్తారు. ఒక గ్రామంలో ఒకే సచివాలయం ఉంటే సమీప గ్రామంలోని సచివాలయాన్ని కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేస్తారు. పట్టణం, మండలం యూనిట్‌గా క్లస్టర్ల ఏర్పాటు దిశగా ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. ఇప్పటికే మండలాల వారీగా క్లస్టర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినట్లు సమాచారం.

కష్టాలు తప్పవు

గ్రామ స్థాయిలో ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్న సచివాలయాల్ని క్లస్టర్లు మార్చితే ప్రజలకు ఇబ్బందులు తప్పవని వైఎస్సార్‌సీపీ నాయకులు అంటున్నారు. ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో గిరిజనుల బాధలు వర్ణణాతీతం. రెండు సచివాలయాలను ఒకటిగా చేస్తే ప్రజలకు మెరుగైన సేవల అందవని ప్రభుత్వం ఈ నిర్ణయంపై పునరాలోచన చేయాలని నాయకులు కోరుతున్నారు.



బుట్టాయగూడెం మండలం అలివేరులో నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే భవనాలు(ఫైల్)

సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్ర



దేశానికే ఆదర్శంగా నిలిచిన సచివాలయాలను నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తుంది. దీనిలో భాగంగానే క్లస్టర్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుంది. రెండు సచివాలయాలు ఒకటి చేయడం వల్ల ప్రజలకు కష్టాలు తప్పవు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో మారుమూల ప్రజలకు తీరని అన్యాయం జరుగుతుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు అందేవి. క్లస్టర్ వ్యవస్థ ఏర్పాటును ప్రభుత్వం విరమించుకోవాలి.

– తెల్లం బాలరాజు, మాజీ ఎమ్మెల్యే

యథేచ్ఛగా మట్టి దందా

ఆగిరిపల్లి: కూటమి నాయకుల అక్రమ మట్టి దందా యథేచ్ఛగా సాగుతోంది. మండలంలోని నరసింగపాలెంలోని బ్రహ్మ లింగయ్య చెరువు వద్ద ఉన్న బండ్లమూరు కొండపై అనుమతి లేకుండానే మట్టి తవ్వకాలు చేపట్టి లక్షలు ఆర్జిస్తున్నారు. పది రోజుల నుంచి జేసీబీ సాయంతో కొండను తవ్వుతున్నారు. అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. నరసింగపాలెంకు చెందిన టీడీపీ నాయకుడి ఆధ్వర్యంలో ఈ మట్టి దందా సాగుతుంది. అధికారులు, గ్రామస్తులు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవడంతో శుక్రవారం మట్టిని లారీలలో తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. మైనింగ్, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే మట్టి మాఫియా ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా సాగుతుందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ ప్రసాద్‌ను సంప్రదించగా అనుమతులు లేకుండా అక్రమ మైనింగ్ చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



నరసింగపాలెంలో మట్టి తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్న గ్రామస్తులు

చల్లచింతలపూడిలో గ్రావెల్ అక్రమ దందా

టాస్క్‌ఫోర్స్: దెందులూరు మండలంలోని చల్లచింతలపూడిలో అక్రమ గ్రావెల్ దందా మళ్లీ ప్రారంభమైంది. పొలం యజమాని గ్రావెల్ తవ్వకాలు అడ్డుకోవడంతో పాటు.. ఎస్‌ఐ, తహశీల్దార్, ఎస్పీ, కలెక్టర్, మైనింగ్ అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. శుక్రవారం అక్రమ తవ్వకాలు చేస్తున్నారని తెలుసుకుని పొలం యజమాని జేసీబీలకు ఎదురుగా వాహనం పెట్టి అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో కారుకు తాడు కట్టి జేసీబీతో మూడు కిలోమీటర్ల అవతలకు తీసుకువెళ్ళి వాహనాన్ని వదిలారు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెబుతున్నారు. స్థల యజమాని బాబురావు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని తన సొంత భూమిలో రక్షణ లేకపోతే ఎలాగని ప్రశ్నిస్తున్నాడు.



జేసీబీతో గ్రావెల్ తవ్వకం చేస్తున్న దృశ్యం

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం దిరుసుమర్రు గ్రామానికి చెందిన బర్రె శ్రీనివాసు (52) ఈ నెల 16న సాయంత్రం తన ద్విచక్ర వాహనంపై కిరాణా సరుకులు తీసుకురావడానికి వెళ్లి తిరిగి వస్తుండగా అదే గ్రామానికి చెందిన నన్నేటి ప్రసాద్ తన టీవీఎస్ వాహనంతో వేగంగా వచ్చి ఢీకొట్టడంతో బర్రె శ్రీనివాసు తలపై బలమైన గాయాలయ్యాయి. వెంటనే ఆటోలో భీమవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరులోని జీజీహెచ్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

భీమవరం: భీమవరం టూటౌన్ పరిధిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులకు తీవ్ర గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. వారిని చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. భీమవరం నుంచి డాక్టర్ బీవీ రాజు మార్గ్‌లో వెళ్తుండగా మరో ద్విచక్ర వాహనం అడ్డుగా రావడంతో వీరు బైక్‌తో డివైడర్‌ను ఢీకొట్టారని స్థానికులు చెబుతున్నారు. ప్రమాద సంఘటనపై పూర్తి వివరాలు ఇంకా రాలేదని పోలీసులు చెప్పారు. గాయపడిన ఇద్దరిలో రాజమహేంద్రవరానికి చెందిన యువకుడి పరిస్థితి విషమంగా ఉందని స్నేహితులు చెబుతున్నారు.

క్లుప్తంగా

మజ్జిగ చలివేంద్రం



మజ్జిగ చలివేంద్రం ప్రారంభిస్తున్న క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి తాపాన్ని తట్టుకునేందుకు, దాహార్తులకు దాహార్తిని తీర్చేందుకు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. మజ్జిగ అందజేశారు. ఆర్యవైశ్యులు కోనా శ్రీనివాసరావు, మారం వెంకటేశ్వరరావు, గిరీష్‌లు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 60 రోజులు పాటు మజ్జిగ అందిస్తామని చెప్పారు. పసుమర్తి అనిల్, పలివెల ఏకాంబరేశ్వరరావు, కొర్లేపర రాము, మండ పవన్, శ్రీధర్ గుప్తా, ఆలపాటి అచ్యుత లక్ష్మి, నున్న సుందరరావు, పులవర్తి రాంపండులు పాల్గొన్నారు.

పైపుల లీకేజీలను అరికడతాం



లీకేజీని అరికడుతున్న వాటర్ వర్క్స్ సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని అన్ని లీకేజీలను తప్పక అరికడతామని, ప్రజల తాగునీటికి ఎటువంటి నీటి సమస్యలు రాకుండా చూస్తామని మునిసిపల్ ఇంజనీర్ వెంకటరమణ అన్నారు. పంపుల చెరువు ట్రీట్మెంట్ ప్లాంట్‌లోని పంపింగ్ మెయిన్ పైపులైన్‌లో లీకేజీలు ఏర్పడ్డాయి. సీఐ పైపులు, మెకానికల్ జాయింట్స్‌ను వాడి లీకేజీను శుక్రవారం అరికట్టారు. ఈ లీకేజీ అరికట్టడం ద్వారా కడకట్ల 1000 కిలో లీటర్లు రిజర్వాయర్ రెండు పూటల నిండుతుందని అధికారులు చెప్పారు. పట్టణంలో ఎక్కడ పైపులైన్ లీకేజీలు ఉంటే తమ దృష్టికి తప్పక తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇంజనీర్ పవన్ కుమార్, ట్యాప్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డైమండ్స్ క్లబ్ సేవలు మరువలేనివి



డైమండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్త పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో డైమండ్స్ చేస్తున్న సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. డైమండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్ అండ్ బి గ్రౌండ్స్‌లో ఉచిత మధుమేహ నిర్ధారణ శిబిరం జరిగింది. రక్త పరీక్షలు చేశారు.డైమండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్ అండ్ బి గ్రౌండ్స్‌లో ఉచిత మధుమేహ నిర్ధారణ శిబిరం జరిగింది. రక్త పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా పేరిచర్ల ఫౌండేషన్ చైర్మన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు అన్ని వయస్సులు వారిని పట్టి పీడిస్తున్న మహమ్మారి షుగర్ వ్యాధి అని, నియంత్రణలో ఉంచుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని పేరిచర్ల ఫౌండేషన్ చైర్మన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు అన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నడక ఆరోగ్యానికి ఎంతో మేలు తెలిపారు. పలు ఆరోగ్య సూత్రాలను అవగాహన చేశారు. జొన్నల సతీష్ కుమార్, కోటి విజయ్ కిషోర్, ఆంజనేయస్వామి, ప్రసాద్, డైమండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

పుంతరోడ్ల అభివృద్ధికి కృషి చేస్తా

అత్తిలి: మార్కెట్‌యార్డు ద్వారా రైతులకు అవసరమైన పుంతరోడ్లు ఏర్పాటుకు కృషి చేస్తానని అత్తిలి ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన దాసం ప్రసాద్ చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీనాయకులను సమన్వయం చేసుకుని ఏఎంసీ ద్వారా రైతులకు ప్రయోజనం చేకూర్చేవిధంగా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.

క్షీరారామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామిని తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట, రామచంద్రపురం ఆర్డీఓలు శ్రీకర్, అఖిలలు దర్శించుకున్నారు. వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

మే 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

పాలకొల్లు సెంట్రల్: మే 20న దేశవ్యాప్తంగా జరగనున్న కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు జవ్వాది శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సంఘ కార్యాలయం వద్ద సమ్మె బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులు అనేక పోరాటాలు ద్వారా సాధించుకున్న చట్టాలు పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం లేబర్ కోడ్‌లుగా మార్చడం సరైనది కాదన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేసి చట్టాలను కొనసాగించాలన్నారు.

ఊరంతా చెత్త కుప్పలు

- పందుల స్వైరవిహారం
- ఇంటిచెత్త కంపోస్టుకు పంపలేక ప్రజలపై రుద్దుడు
- చెత్త పాయింట్లు అధికారుల నిర్వాకమే అంటున్న ప్రజానీకం
- స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర ఇదేనా అంటూ ఆగ్రహం



తణుకు గాడేపల్లి అన్నపూర్ణమ్మ పాఠశాల ముందు భారీ చెత్త కుప్ప



తణుకు సజ్జాపురం బండి వారి వీధి ప్రాంతంలో తిష్టవేసిన పందులు



తణుకు బొమ్మలవీధి నంబరు 13 మునిసిపల్ పాఠశాల పక్కనే పందుల స్వైరవిహారం

తణుకు అర్బన్: చెత్త.. చెత్త.. చెత్త. తణుకులో ఏ ప్రాంతంలో చూసినా ముందుగా కనిపించేవి చెత్త కుప్పలు. పచ్చని పొలంలోని పైరుకు దిష్టి తగలకుండా బూతుబొమ్మలున్న ఫ్లెక్సీలను రైతులు పెడుతుంటారు అలాగే ప్రస్తుత కూటమి ప్రభుత్వం చెబుతున్నట్లుగా మెరుస్తున్న తణుకు ప్రాంతానికి దిష్టి తగలకుండా చెత్తకుప్పలను ఏర్పాటు చేస్తున్నారా అంటూ ప్రజలు చెవికొరుక్కుంటున్నారు. ఇంటి చెత్త నేరుగా కంపోస్టు యార్డుకు పంపించడం చేతకాక చెత్త పాయింట్లు ఏర్పాటు చేస్తున్న మునిసిపల్ అధికారులకు తోడుగా ప్రజా ప్రతినిధులు సైతం చెత్తకుప్పల వద్దకు వచ్చి ప్రజలదే తప్పు అన్నట్లుగా మాట్లాడుతుండడాన్ని ప్రజానీకం తప్పుపడుతున్నారు. గత ఐదేళ్లు చెత్త సమస్య కానీ, చెత్త కుప్పలు రోడ్లపై కానీ కనిపించని పరిస్థితి ఉండగా నేడు మాత్రం ఏ రోడ్డుపై చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తుండడంతో తాజాగా ఆ చెత్తకు ప్రజలనే బాధ్యులుగా చేస్తున్నట్లుగా మాట్లాడుతుండడాన్ని ప్రజలు సైతం విమర్శిస్తున్నారు.

నిత్యం 50 టన్నులకుపైగా చెత్త సేకరణ

తణుకు పురపాలక సంఘ పరిధిలోని 34 వార్డులకు సంబంధించి నిత్యం 50 టన్నులకుపైగా చెత్తను కంపోస్టుయార్డుకు తరలించాల్సి ఉంటుంది. ఇందుకోసం గత ప్రభుత్వ హయాంలో ఇంటి చెత్త నేరుగా కంపోస్టుకు వెళ్లాలనే ఉద్దేశ్యంతో రాష్ట్రమంతా క్లాప్ వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. తణుకు పురపాలక సంఘ పరిధిలోని 27 సచివాలయాలకు 27 క్లాప్ వ్యాన్‌ల ద్వారా చెత్తను నేరుగా కంపోస్టుకు తరలించేవారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక క్లాప్ వాహనాలను నిలిపివేయగా చెత్త సేకరణ పూర్తిగా చిత్తయిపోయి రోడ్డుపై చెత్తకుప్పలు రాజ్యమేలుతున్నాయి. సమస్యను గుర్తించిన అధికారులు ఇటీవల 15 వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చినా చెత్త సమస్య మాత్రం తప్పడంలేదు. శానిటరీ అధికారుల పర్యవేక్షణ లోపంతోపాటు ఇంటి నుంచి వచ్చే చెత్తను నేరుగా స్వీకరించలేకపోవడమే ప్రధాన సమస్యగా ప్రజానీకం చెబుతున్నారు.

పందులను పెంచుతున్న వైనం

గత ఐదేళ్లు కనిపించని పందులు నేడు మునిసిపాలిటీ పరిధిలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. పందుల వలన రోగాలతోపాటు దుర్వాసన, దుర్గంధం వస్తుందనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వ హయాంలో ఊరి చివర కంపోస్టు యార్డుకు పందులను పరిమితం చేశారు. కానీ ప్రస్తుతం తణుకులోని కొన్ని ప్రాంతాల్లో పందుల పెంపకానికి మునిసిపల్ అధికారులు ప్రణాళిక సిద్ధం చేసి మరీ సహకరిస్తున్నట్లుగా ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సజ్జాపురం, బొమ్మలవీధి ప్రాంతంలోని నంబరు 13 మునిసిపల్ పాఠశాల ప్రాంతాల్లో పందులు స్వైరవిహారం చేస్తున్నా శానిటరీ అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజానీకం ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు విద్యనభ్యసించే పాఠశాలల వద్ద పందులు సంచరిస్తుండడం, చెత్తకుప్పలతో దుర్గంధంగా మారడాన్ని ప్రజానీకం సైతం ఇదేనా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించిన స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యమంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రజాప్రతినిధులు స్వచ్ఛ ఆంధ్ర అంటూ ఫొటోలకు ఫోజులివ్వడమే తప్ప ఆచరణలో లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు.

చెత్త పాయింట్లు

తణుకులో ఇంటి చెత్తను నేరుగా కంపోస్టు యార్డుకు పంపించలేని శానిటరీ అధికారులు ప్రతి ఏరియాలోను చెత్త పాయింట్‌ను ఏర్పాటు చేసి చెత్తను డంపింగ్ చేసే విధంగా కార్యాచరణ చేశారు. దీంతో గంటల తరబడి చెత్తకుప్పలు రోడ్లపైనే ఉండే పరిస్థితి నెలకొంది. పారిశుద్ధ్య కార్మికులు ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను ఒక పాయింట్‌లో కుప్పగా వేయడం ఆనక ఎప్పుడో వచ్చే ట్రాక్టరు ద్వారా కంపోస్టుకు తరలించే విధంగా శానిటరీ అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో చెత్త పాయింట్లు ఉన్న సజ్జాపురం, కోర్టు, టౌన్ హాలు, రైల్వే స్టేషన్ రోడ్డు, వేల్పూరు రోడ్డు, రెడ్‌క్రాస్, ఇరగవరం కాలనీ, పైడిపర్రు రవీంద్ర ఐటీఐ, రూరల్ పోలీస్ స్టేషన్, బస్టాండ్, పాతవూరు, కొండాలమ్మ పుంత, ఇరగవరం కాలనీల్లో దుర్గంధపూరితమైన వాతావరణం కనిపిస్తోందని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు.

కాన్‌ప్లెక్స్ దృశ్యాలు ఇక ఆస్వాదించవచ్చు





ప్రారంభోత్సవంలో మంత్రులు శ్రీనివాసవర్మ, దుర్గేష్, ఎమ్మెల్యే బొలిశెట్టి, మాజీ మంత్రి కొట్టు

తాడేపల్లిగూడెం: పట్టణంలోని ఆర్టీసీ డిపో సమీపంలో ఏర్పాటు చేసిన కాన్‌ప్లెక్స్ శ్రీశ్రీ స్క్రీన్స్‌ను శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. అధునాతన సాంకేతిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన ఈ స్క్రీన్స్‌పై ఇక కావాల్సిన చిత్రాలను ఆస్వాదించవచ్చని వక్తలు పేర్కొన్నారు. మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, బీజేపి టీడీపి నాయకులు ఈతకోట తాతాజీ, వలవల బాబ్జీ తదితరులు పాల్గొన్నారు. ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా సకల సౌకర్యాలు ఇక్కడ అందుతాయని నిర్వాహకులు శ్రీశ్రీ శ్రీనివాసు, ఎస్.వి.రమణ, చలంచర్ల హరిప్రసాద్‌లు తెలిపారు. ప్రముఖ చిత్ర పంపిణీ దారు ఉషా బాలకృష్ణ అన్ని పార్టీల నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉండి: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లైన్ల మరమ్మతుల నిమిత్తం 19వ తేదీ శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఉండిలోని మెయిన్ సెంటర్, పెద్ద వంతెన ఏరియా, రాజులపేట, సంతమార్కెట్, తహసీల్దార్ కార్యాలయం ఏరియాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు.

అవగాహనతోనే అగ్ని ప్రమాదాల నివారణ



మాక్ డ్రిల్‌లో ఫైర్ సిబ్బంది తదితరులు



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి గంగరాజు

తణుకు అర్బన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా తణుకు అగ్నిమాపక కేంద్ర సిబ్బంది శుక్రవారం తణుకు ఉండ్రాజవరం రోడ్డులోని పెట్రోల్ బంకులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంకుల్లో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు సిబ్బంది ఎలా అడుగు వేయాలి, ఏం చేయాలనే విషయాలను ప్రయోగాత్మకంగా వివరించారు. ముఖ్యంగా బంకుల్లో అందుబాటులో ఉన్న అగ్నిమాపక పరికరాలను ఉపయోగించే విధానాన్ని చూపించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్ర సిబ్బంది, పెట్రోల్ బంకు సిబ్బంది, ప్రజానీకం పాల్గొన్నారు.



తణుకులో పెట్రోల్ బంకులో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అగ్ని ప్రమాదాలు పై జాగ్రత్తలు తీసుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా అగ్నిమాపక కేంద్రాధికారి గణేశ్న వెంకట రామారావు ఆధ్వర్యంలో శుక్రవారం ఐదోవ రోజు పట్టణంలోని పెట్రోల్ బంకులు వద్ద, ప్రత్తిపాడు 3ఎఫ్ ఇండస్ట్రీ వద్ద అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన, మాక్‌డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు- తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక సిబ్బంది పెట్రోల్ బంకు సిబ్బందికి, ఇండస్ట్రీ సిబ్బందికి అవగాహన కల్పించారు. పరిశ్రమలలో సంభవించే అగ్ని ప్రమాదాలు వల్ల పొగ ఎక్కువగా వస్తుందని, ఎక్కువ మంది ప్రాణాలు కల్పోయి అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రమాదా లు జరిగినప్పుడు ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో వివిధ విన్యాసాలతో, వివిధ పరికరాలను ప్రదర్శించారు. అవగాహన కల్పించారు. తొలుత పట్టణంలో ర్యాలీ జరిగింది. కరపత్రాలను పంపిణీ చేశారు.

అగ్ని ప్రమాదాల నివారణ పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలి

అత్తిలి: గ్యాస్ కంపెనీలు, కర్మాగారాలలో అగ్నిప్రమాద నివారణ పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని అత్తిలి అగ్నిమాపక అధికారి కొవ్వాసు గంగరాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా శుక్రవారం అత్తిలి అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో గ్యాస్ కంపెనీ, పెట్రోల్ బంకులు, టైల్స్ పరిశ్రమ వద్ద అగ్నిప్రమాదాల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అత్తిలి హెచ్‌పీ గ్యాస్ కంపెనీ వద్ద సిబ్బందికి గ్యాస్ లీకై మండుతున్న సమయంలో ఆర్పే పద్ధతులను వివరించారు. శ్రీసూర్య ఇండియన్ ఆయిల్ ఫిల్లింగ్ స్టేషన్ వద్ద ఫైర్ అయినపుడు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి, ఆర్పే విధానాన్ని డెమో ద్వారా తెలిపారు. పిప్పరలో టైల్స్ ఫ్యాక్టరీ వద్ద సిబ్బందికి అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, మంటలను అదుపుచేసే పద్ధతులను ఫైర్ ఆఫీసర్ కె గంగరాజు వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

కూలీలు దూరమయ్యేలా నిబంధనలు



కొత్తూరు గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో ఏర్పాటు చేసిన సమావేశ దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పథకం పనులకు కూలీలు దూరమయ్యేలా కేంద్ర ప్రభుత్వం నిధులు తగ్గిస్తూ కొత్త కొత్త నిబంధనలు పెడుతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు విమర్శించారు. ఉపాధి హామీ పథకం సమస్యల పరిష్కారానికై ఈ నెల 22న జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించ తలపెట్టిన మహాధర్నాకు జన సమీకరణలో భాగంగా శుక్రవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ అనేక పోరాటాల ద్వారా ఉపాధి హామీ పథకం చట్టాన్ని సాధించుకున్నామని, ఎవరో పెట్టిన బిక్ష కాదని స్పష్టం చేశారు. 22న కలెక్టరేట్ వద్ద జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కండెల్లి బాబూరావు, జ్యోత్స్న, చింతాడ గ్రేస్ లత, మారంపూడి అనిత తదితరులు పాల్గొన్నారు.

శివాలయ నిర్మాణానికి విరాళాలు



ప్రత్తిపాడు శివాలయానికి విరాళం అందజేస్తున్న భోగేశ్వరరావు

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు గ్రామంలో నూతనంగా ప్రతిమాంబసమేత సదాశివ స్వామి ఆలయం నిర్మాణం వేగంగా జరుగుతోంది. గ్రామస్తులు, ఆలయకమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఆలయానికి ఇప్పటికే పలువురు విరాళాలు అందజేశారు. శుక్రవారం అలంపురం టీబీఆర్ సంస్థల అధినేత బోగేశ్వరరావు తన వంతు విరాళం రూ.1లక్షలను, దేవీశ్రీ ట్రేడర్స్ రూ. 1 లక్ష, గూడెంకు చెందిన ప్రముఖ వాణిజ్యవేత్త నంద్యాల కృష్ణమూర్తి రూ. 75 వేలు విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఈ మొత్తాన్ని ఆలయ నిర్వాహకులు, కమిటీ చైర్మన్ వీర్ల కృష్ణకు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జవ్వాది శేషగిరి, వీర్ల ధనరాజు, కామిశెట్టి ధనరాజు, ఆరాధ్యుల అంజి, తూము చిన్న, కడకట్ల శ్రీను తదతరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

పెనుగొండ: మార్చి నెల నుంచి చెల్లించాల్సిన ఉపాధి పని వేతనాలు తక్షణం చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ మండల కార్యదర్శి షేక్ పాదుషా డిమాండ్ చేశారు. శుక్రవారం పెనుగొండ మండలం మునమర్రులో ఉపాధి కూలీలతో కలసి ధర్నా నిర్వహించారు. పని ప్రాంతాల్లో కనీస రక్షణ చర్యలు తీసుకోవడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. కాళ్లల్లో గాజు పెంకులు గుచ్చుకొని బాధపడుతున్న కార్మికులకు ప్రథమ చికిత్స చెయించి, ప్రభుత్వమే చేయించాలని డిమాండ్ చేశారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



దంతుపల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ

అత్తిలి: ఉపాధి హామీ కూలీల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 22న కలెక్టరేట్ వద్ద జరుగుతున్న మహాధర్నాలో కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేతా గోపాలన్ కోరారు. శుక్రవారం అత్తిలి మండలం దంతుపల్లి గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను వారు కలిసి ఉపాధి హామీలో ఉన్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా సత్యనారాయణ, గోపాలన్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ఉపాధిహామీ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కూలీలందరూ ఐక్యంగా ఉపాధి హామీ పరిరక్షణకు సిద్ధం కావాలని అన్నారు. ఆరవల్లి గ్రామానికి చెందిన స్వర్గీయ వీరవల్లి గణేశ్వరరావు కుటుంబ సభ్యుల ఆర్థిక సహాయంతో 200 మంది ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు, మండల నాయకులు వనం రాంబాబు, బి ఉమాదేవి, కె లక్ష్మి, జి ఆశ, ఎస్ లక్ష్మీదుర్గ, పి నాగదుర్గ, పి రేవతి, బి నాగలక్ష్మి, కేకే కుమారి, పద్మావతి పాల్గొన్నారు.

పైప్‌లైన్‌పై అక్రమ కట్టడం

ఆకివీడు: మండలంలోని పెదకాపవరం గ్రామంలోని మంచినీటి చెరువుకు వెంకయ్య వయ్యేరు పంట కాలువ నుంచి నేరుగా నీరు వచ్చే పైప్‌లైన్‌పై నిర్మించిన అక్రమ కట్టడంతో పైప్‌లైన్ పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. గత నాలుగు రోజుల క్రితం పైప్‌లైన్ పగిలిపోయి నీరు కారడంతో ఆయా ప్రాంతాలను పరిశీలించారు. చివరకు అక్రమ కట్టడం క్రింద పైప్ పగిలినట్లు గుర్తించారు. దీంతో మరమ్మతులు చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు, ఆలకోడు కాలువ గట్టు ఆక్రమించి అక్రమ కట్టడంతో పైప్‌లైన్ పాడైపోతుందని స్థానికులు వాపోతున్నారు. మరమ్మతులు చేయడానికి షెడ్డు పునాదుల క్రింద పైప్‌లైన్ ఉండటంతో పంచాయతీ సిబ్బంది తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆక్రమణదారుడు అడ్డెకు ఇవ్వడంతో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉందని స్థానికులు వాపోతున్నారు.

పార్కుల అభివృద్ధికి సహకరించాలి



తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు అర్బన్: తణుకు పట్టణంలోని పార్కుల అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు, దాతల సహకారం ఎంతో అవసరముందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్పష్టం చేశారు. శుక్రవారం తణుకు పురపాలక సంఘ కార్యాలయ సమావేశ మందిరంలో పి-4 లక్ష్యంగా ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో పార్కుల అభివృద్ధికి పారిశ్రామికవేత్తలతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పారిశ్రామికవేత్తలు, దాతలు పట్టణంలోని పార్కులు, బస్ షెల్టర్స్, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో మౌలిక సదుపాయాల కల్పనకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే అరిమిల్లి రాధకృష్ణ, ఆంధ్ర షుగర్స్ జీఎం ఏ.సాంబశివరావు, అక్కమాంబ టెక్స్టైల్స్ లిమిటెడ్ ప్రతినిధులు ఎన్‌కే మొహిద్దీన్, కే.రామకృష్ణ, ఎన్‌కె మెరైన్స్ ప్రతినిధి వి.శ్రీనివాస్, జి.రాజేష్, దేవి సీఫుడ్స్ ప్రతినిధులు ఎస్.శివకుమార్, వై.కళ్యాణ్, ఫ్లటస్ టెక్ ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు సిహెచ్ ఫణీంద్ర, ఎం.వెంకట్ రాజు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు



పెంటపాడు: ఈపీఎఫ్ చర్చిలో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలో పాల్గొన్న విశ్వాసులు



పెంటపాడు: గూడెం టౌన్ సెంటినరీ చర్చిలో దేవుని వాక్యం బోధిస్తున్న జాన్ ఇర్విన్, గురుమండల అధ్యక్షుడు ఫీనెహాస్

పెంటపాడు: క్రీస్తు శిలువ శ్రమలను తలుస్తూ ఆధ్యాత్మికంగా విశ్వాసులు నవీన స్వభావంతో ఉండాలని, తద్వారా దేవుని కృపను పొందాలని ఈపీఎఫ్ సంఘ అధ్యక్షుడు పాస్టర్ మోజస్ ప్రవీణ్ పేర్కొన్నారు. గుడ్‌ఫ్రైడే పురస్కరించుకొని తణుకు ఇమ్మానియేలు ప్రార్థనా మందిరంలో పాస్టర్ మోజస్ ప్రవీణ్ దేవుని వాక్యం బోధించారు. ఏసుప్రభువు శిలువపై పలికిన ఏడు మాటల సారాన్నిసేవకురాలు అరుణకుమారి, సహోదరి ఫ్రైజీలు బోధించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గూడెం నియోజకవర్గంలో పలు క్రైస్తవ మందిరాలలో గుడ్ ఫ్రైడేను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పెంటపాడు మండలంలోని పెంటపాడు, యానాలపల్లి, కె. పెంటపాడు, జట్లపాలెం తదితర గ్రామాలలో లూథరన్ చర్చిలు, రాచర్ల రూపాంతర దేవాలయం, మీనవిల్లూరు ఏసయ్యా ప్రార్థనా మందిరంలో బిషప్ డీవీ కృష్ణ, పాస్టర్ మహేష్, బి. కొండేపాడు గ్రామంలో సియోను ప్రార్థనామందిరం , రాచర్ల రూపాంతర దేవాలయం, బాగ్యలక్ష్మిపేట ఎల్ఎల్ఎం చర్చి లో మల్లిపూడి జైబాబులు గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు ప్రదేశాలలో ప్రాంతాలలో గుడ్‌ఫ్రైడేను నిర్వహించారు. పాతూరు ఆర్సీఎం చర్చి, గూడెం మథర్‌వన్నిని చర్చి, చినతాడేపల్లి షెకీనా మందిరం, కడియద్ద, ప్రత్తిపాడు, ఆరుగొలను బైబిలుమిషను మందిరాలలో గుడ్ ఫ్రైడేను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం గూడెం టౌన్ ఎ.క్లాస్ ప్యారిష్ సెంటినరీ చర్చిలో గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చి గురు మండల అధ్యక్షుడు ఫీనెహాస్ ప్రారంభ ప్రార్థన చేయగా కడపకు చెందిన ఆర్డీవో జాన్ ఇర్విన్ పాలపర్తి దేవుని వాక్యం బోధించారు. క్రీస్తు బోధనల సారంగా విశ్వాసులు నడవాలన్నారు.

క్రీస్తు బోధనలను అనుసరించాలి

అత్తిలి: మండలంలో గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. అత్తిలి ఫ్యారీస్ క్యాథలిక్ చర్చి ఆధ్వర్యంలో వెయ్యి మంది విశ్వాసులతో శుభ శుక్రవార ర్యాలీని నిర్వహించారు. ఫాదర్ లక్కపాము చైతన్యరాజు క్రీస్తు శిలువమోస్తూ క్రీస్తు గీతాలను ఆలపించారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో డీఎస్ఎఫ్ఎస్ సిస్టర్స్, కౌన్సిలర్లు, ఉపదేశకులు, గ్రామ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

'గూడెం' మండలంలో ఘనంగా గుడ్ ఫ్రైడే

తాడేపల్లిగూడెం రూరల్: గుడ్ ఫ్రైడేను మండలంలోని కుంచనపల్లి, మోదుగ గుంట, మెట్ట ఉప్పరగూడెం, ఉప్పరగూడెం, జగన్నాథపురం, మాధవరం, కొత్తూరు, ఆరుళ్ల, నవాబుపాలెం తదితర గ్రామాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆయా గ్రామాల్లోని క్రీస్తు మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. పెదతాడేపల్లి మదర్ వన్నినీ చర్చి ఆధ్వర్యంలో శిలువతో పాదయాత్ర నిర్వహించారు. చర్చి నిర్వాహకులు పాస్టర్లు రెవరెండ్ జోసఫ్ అర్జున్, రెవరెండ్ ప్రేమ్‌కుమార్‌లు క్రీస్తు సందేశాన్ని వివరించారు. పాస్టర్లు డి.ఆదాము, కే.పేతురు, డి.రవికుమార్, ఎం.జయరాజు పాల్గొన్నారు.